



ఇటీవల ఖానాపూర్ అడవుల్లో నరికి వేతకు గురైన టేకుచెట్టు



ఖానాపూర్ అడవుల్లో యథేచ్ఛగా వనమేధం

- నాలుగైదు ఏళ్లుగా స్తబ్దుగా ఉండి.. తాజాగా తిరిగి విజృంభిస్తున్న స్మగ్లర్లు
- నిర్మల్ - మంచిర్యాల, నిర్మల్ - ఖానాపూర్ రహదారులను ఆనుకుని విలువైన టేకు చెట్ల నరికి వేత
- ఈసారి గొడ్డలి వేటుతో పాటు టేకు వృక్షాలపై యంత్రాలతో కోతలు
- ఆధునిక యంత్రాల సహాయంతో చెట్లను నరికి వేసినట్లు ఆనవాళ్లు
- అటవీశాఖను వెంటాడుతున్న సిబ్బంది కొరత

నిర్మల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెద్దపులుల సంరక్షణ ధ్యేయంగా ఏర్పాటైన కవ్వాల్ అభయారణ్యం ప్రాంతాన్నంత టైగర్‌జోన్‌గా మార్చిన నాటి నుంచి ప్రభుత్వం కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని అడవులను అభివృద్ధి చేస్తోంది. కవ్వాల్ అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తోంది. కవ్వాల్ ప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు అధికారుల పర్యటనలు సాగుతున్నాయి. అయినా ఈ పర్యటనలు అన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడవుల సంరక్షణకు అటవీశాఖ చేపడుతున్న చర్యలన్నీ నీటి పాలవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా జిల్లా అడవుల్లో పెద్దపులులు సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ సంరక్షణపై మరింత పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిన అటవీశాఖ అధికారులు ఆ దిశగా చేపడుతున్న చర్యలు తూతూ మంత్రంగానే సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నోఏళ్లుగా ఎదురుచూసిన పెద్దపులుల రాక తాజాగా కవ్వాల్ అభయారణ్యంలో కొనసాగుతున్న నేపథ్యంలో కంటికి రెప్పలా అడవులను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అపవాదులు మూటగట్టుకుంటున్నారు. తాజాగా కవ్వాల్ అభయారణ్యం పరిధిలో మళ్లీ కలప స్మగ్లర్లు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నాన్ని చేస్తూ రోడ్డు పక్కనే చెట్లను నరుకుతూ అటవీశాఖకు సవాల్ విసురుతున్నారు. ఇటీవల వరుసగా ఖానాపూర్ ప్రాంతంలోని అడవుల్లో రోడ్ల పక్కనే విలువైన టేకు వృక్షాలను నరికి వేసి వనమేధానికి పాల్పడుతున్నారు. నాలుగైదు ఏళ్లుగా ఖానాపూర్ ప్రాంత అడవుల్లో మూగబోయిన గొడ్డళ్ల చప్పుళ్లు తిరిగి జోరుగా వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరత వెక్కిరిస్తుండడంతో అటవీశాఖ అడవుల పర్యవేక్షణపై ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఖానాపూర్ అడవుల్లో విలువైన టేకు చెట్ల నరికివేత

దట్టమైన అడవులకు పెట్టింది పేరుగా నిలిచే ఖానాపూర్ ప్రాంత అడవుల్లో తిరిగి స్మగ్లర్ల అలజడి రేకెత్తుతోంది. ఇటీవల కాలంలో వరుసగా విలువైన టేకు చెట్లను మట్టు పెడుతున్న స్మగ్లర్లు అటవీశాఖకు దొరకకుండా దోబూచులాడుతూ తమ పనిని కానిచ్చేస్తున్నారు. నిర్మల్ - ఖానాపూర్ రహదారి వెంబడి మస్కాపూర్ బీట్ పరిధిలో రోడ్డు పక్కనే విలువైన టేకు చెట్లను నరికివేశారు. నిర్మల్ - మంచిర్యాల రహదారిని ఆనుకుని ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్‌కు కూతవేటు దూరంలో ఖానాపూర్ బీట్ పరిధిలో విలువైన టేకుచెట్లను నరికి వేసి స్మగ్లర్లు టేకు దుంగలను తరలించుకు వెళ్లారు. స్మగ్లర్లు తరలించుకు వెళ్లగా మిగిలిన టేకు దుంగలను అటవీశాఖ అధికారులు ఖానాపూర్ కలప డిపోకు తరలించారు.

గొడ్డలివేటుతో పాటు యంత్రాల కాటు

కవ్వాల్ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా మార్చిన తర్వాత గత నాలుగైదేళ్లుగా ఈ ప్రాంతంలో కలప స్మగ్లింగ్‌కు దాదాపుగా అడ్డుకట్ట పడింది. తాజాగా ఖానాపూర్ అడవుల్లో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు విలువైన వృక్ష సంపదను నేలమట్టం చేసి టేకు దుంగలను తరలించుకు వెళ్లారు. ఇదంతా ఒకెత్తు అయితే తాజాగా జరిగిన ఈ వనమేధంలో టేకు చెట్లను నరికేందుకు స్మగ్లర్లు ఆధునిక యంత్రాలను ఉపయోగించినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. నిర్మల్-మంచిర్యాల రహదారి, నిర్మల్ - ఖానాపూర్ రహదారులు నిరంతరం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయి. ఈ రహదారులను ఆనుకుని ఉన్న అటవీప్రాంతంలో రోడ్డుకు సమీపంలోనే విలువైన టేకుచెట్లను నరికి వేసేందుకు గొడ్డళ్లతో పాటు యంత్రాలను ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో టేకు దుంగలను రంపం లాంటి యంత్రంతో కోసినట్లు ఆనవాళ్లు కనిపించడం చూస్తే స్మగ్లర్లు నిమిషాల వ్యవధిలోనే టేకు చెట్లను నేలమట్టం చేసి వాటిని దుంగలుగా మలిచి వాహనాల్లో తరలించుకు వెళ్లినట్లు కనిపిస్తోంది. వీరికి ఆదిలోనే అడ్డుకట్ట వేయకపోతే మరింత వృక్ష సంపదను నేలమట్టం చేసి దుంగలుగా మలిచి తరలించుకు వెళ్లి కోట్ల రూపాయల ప్రకృతి సంపదను కొల్లగొట్టడం ఖాయమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

సామిల్ నిర్వాహకులపై తలెత్తుతున్న అనుమానాలు...

ఖానాపూర్ అడవుల్లో జరిగిన వనమేధం వెనుక కొంత మంది సామిల్ నిర్వాహకుల పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సామిల్‌లను నిర్వహిస్తున్న కొంతమంది వ్యక్తులు విలువైన టేకు చెట్లను తమ సామిల్‌లకు కలపను తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సైతం జిల్లాలో నిబంధనలు ఉల్లంఘించిన నెపంతో అటవీశాఖ అధికారులు పలు సామిల్‌లను టింబర్ డిపోలను సీజ్ చేసినట్లు చెబుతున్నారు. కాగా గత కొద్దిరోజుల క్రితం తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకొని తిరిగి సామిల్, టింబర్ డిపోల నిర్వహణను పునరుద్ధరించుకున్న జిల్లాలోని కొంతమంది వ్యక్తులు ఈ అక్రమ దందా వెనుక కీలకపాత్రను పోషిస్తున్నట్లు చెబుతున్నారు.

రెండేళ్లుగా రెగ్యులర్ ఎఫ్‌డీవోకు నోచుకోని ఖానాపూర్ డివిజన్



ఖానాపూర్ అడవుల్లో టేకుచెట్టును కోసి తరలించడానికి సిద్ధంగా ఉన్న దృశ్యం

కవ్వాల్ అభయారణ్యంలో అత్యంత కీలకమైన ఖానాపూర్ డివిజన్ గత రెండేళ్లుగా రెగ్యులర్ ఎఫ్‌డీవోకు నోచుకోవడం లేదు. గతంలో ఎఫ్‌డీవోగా విధులు నిర్వహించిన కోటేశ్వరరావు బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం వెళ్లగా ఖానాపూర్‌కు ఆర్మూర్ ఎఫ్‌డీవో భవానిశంకర్‌ను ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా నియమించారు. అప్పటి నుంచి రెగ్యులర్ ఎఫ్‌డీవో లేక ఖానాపూర్ డివిజన్ పరిధిలోని అడవుల్లో పర్యవేక్షణ లోపించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా ఉన్న అధికారి క్షేత్రస్థాయిలో జరుగుతున్న విషయాలను తెలిపేందుకు సామాన్యులు ఫోన్ చేసినా కనీసం ఎత్తరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని ఖానాపూర్ డివిజన్ పరిధిలో ఖానాపూర్, కడెం, ఉడుంపూర్, పెంబి, తాండ్ర అటవీరేంజ్ కార్యాలయాలున్నాయి. ఈ ఐదు అటవీరేంజ్ కార్యాలయాల పరిధిలో గల అడవుల సంరక్షణను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగిన ఖానాపూర్ అటవీశాఖ డివిజన్ అధికారి పోస్టుఖాళీగా ఉండడంతో పర్యవేక్షణ పక్కదారి పడుతోందని చెబుతున్నారు.

అటవీశాఖను వెక్కిరిస్తున్న ఖాళీల కొరత

ఖానాపూర్ డివిజన్ పరిధిలో అడవులను కాపాడాల్సిన అటవీశాఖను సిబ్బంది కొరత వెక్కిరిస్తుంది. డివిజన్ పరిధిలో అడవుల సంరక్షణను పర్యవేక్షించాల్సిన ఎఫ్‌డీవో ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. 5 అటవీరేంజ్ కార్యాలయాల పరిధిలోని అడవులను రక్షించేందుకు ఐదుగురు ఎఫ్‌ఆర్‌వోలు అవసరం ఉండగా తాండ్ర ఎఫ్‌ఆర్‌వో పోస్టు ఖాళీగా ఉంది. డివిజన్ పరిధిలో 20 మంది ఫారెస్ట్ సెక్షన్ అధికారులు విధులు నిర్వహించాల్సి ఉండగా రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖానాపూర్ డివిజన్ పరిధిలో 131 మంది బీట్ అధికారులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం 48 మంది బీట్ అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు బీట్లు ఇన్‌చార్జిగా ఉండడంతో క్షేత్రస్థాయిలో అడవుల పర్యవేక్షణ సరిగా జరగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖానాపూర్ డివిజన్ పరిధిలో రెగ్యులర్ ఎఫ్‌డీవోతో పాటు ఖాళీగా ఉన్న ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవో పోస్టులను భర్తీ చేయకపోతే విలువైన వృక్ష సంపద స్మగ్లర్ల పాలయ్యే పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్మగ్లర్లను గుర్తించే దిశగా విచారణ కొనసాగుతోంది

ఖానాపూర్, మస్కాపూర్ బీట్‌ల పరిధిలో ఇటీవల జరిగిన టేకు చెట్ల నరికివేతకు పాల్పడిన స్మగ్లర్లను గుర్తించే దిశగా విచారణ కొనసాగుతోంది. టేకు చెట్లను నరికి వేసిన ప్రాంతంలో టవర్ లొకేషన్ కాల్ డేటా తదితర టెక్నికల్ అంశాలను సైతం అధికారికంగా సేకరిస్తున్నాం. ఖచ్చితంగా స్మగ్లర్లను గుర్తించి కఠిన చర్యలు చేపడతాం. కలప స్మగ్లింగ్‌కు పాల్పడేవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవు.

సంతోష్‌రాజ్, ఖానాపూర్ అటవీశాఖ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి

గణితశాస్త్ర రాష్ట్ర సెమినార్‌లో

పాల్గొన్న జిల్లా ఉపాధ్యాయుడు



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉపాధ్యాయుడు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం ఈద్గాం హైస్కూల్ ఉపాధ్యాయుడు ఏ. మునీందర్‌రాజు శనివారం హైదరాబాద్ ఎస్ఈఆర్‌టీలో నిర్వహించిన గణితశాస్త్ర సెమినార్‌లో పాల్గొన్నారు. 'టైంలెస్ జర్నీ - ఫ్రమ్ వేదిక్ మ్యాథ్స్ టు క్వాంటం కంప్యూటింగ్' అంశంపై పరిశీలన పత్రం ప్రవేశపెట్టారు. డైరెక్టర్ జి.రమేష్, గణిత విభాగ హెడ్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే అధికారులకు

దరఖాస్తుదారులు సహకరించాలి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న భైంసా మున్సిపల్ కమిషనర్

భైంసా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే నిర్వాహణకు వచ్చే అధికారులకు దరఖాస్తుదారులు సహకరించాలని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని పలు వార్డులలో సర్వే నిర్వహిస్తున్న వార్డు అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. యాప్‌లో నమోదు చేస్తున్న దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల పరిధిలోని దరఖాస్తుదారులతో మాట్లాడుతూ వార్డు అధికారులు అడిగే ప్రతి ప్రశ్నకు సంబంధించి వివరాలను అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన విధి,విధానాలకు అనుగుణంగా కొనసాగుతున్న సర్వేలో దరఖాస్తుదారులు వాస్తవ వివరాలు. అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను వార్డు అధికారులకు అందించాలని తెలిపారు. సర్వే ఆద్యాంతం పారదర్శకతతో జరుగుతోందని వెల్లడించారు.

ఆధునిక పద్ధతులలో సంప్రదాయ పంటలు

సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



కడెం వ్యవసాయశాఖ విత్తన ఉత్పత్తి కేంద్రానికి మంజూరైన పట్టాపాస్ బుక్‌ను అధికారులకు అందజేస్తున్న జిల్లా కలెక్టర్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక పద్ధతులలో సాంప్రదాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ ఆహార భద్రత పథకం -2024 కింద జిల్లాలో వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న కార్యాచరణపై వ్యవసాయశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆధునిక పద్ధతుల ద్వారా సంప్రదాయ పంటలు సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో వరి, జొన్న, నూనెగింజలు, పప్పుధాన్యాల విస్తీర్ణం పెంచాలని, అలాగే అధిక దిగుబడులు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు గాను కార్యాచరణ అమలుకు కోటి రూపాయల నివేదిక ఆమోదించడం జరిగిందన్నారు. కృత్రిమ ఎరువులు అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు వాటి ద్వారా పండిన పంటలు అనేక రకాల వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రజలంతా సేంద్రియ ఉత్పత్తుల వైపు మల్లుతున్నారని తెలిపారు. సహజసిద్ధ ఎరువులతో పండించిన పంటలకు విపణిలో మంచి గిరాకీ ఉందన్నారు. రైతులందరికీ సేంద్రియ వ్యవసాయ ప్రాధాన్యంపై అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించి, సహజ సిద్ధ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. వేప నూనెను పంటల ఎరువుగా విరివిగా ఉపయోగించడం వల్ల అధిక దిగుబడులు సాధించి, లాభాలు పొందవచ్చునన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సంఘాల వారిచే ఈ వేపనూనె తయారీ ప్రారంభించి ఇరువర్గాలు లాభం పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులను గుర్తించి, సంఘాలను ఏర్పాటు చేసి లబ్ధిపొందే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న మరింత మంది రైతులను గుర్తించి రైతుల ద్వారా రైతులకు అవగాహన' అనే విధానం ద్వారా సేంద్రియ పంటలనుసాగుపై అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలకు ఆసక్తి ఉన్న రైతులను తీసుకెళ్లి మెలకువలను నేర్పాలని, సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లలో సేంద్రియ ఉత్పత్తుల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం కడెం వ్యవసాయశాఖ విత్తన ఉత్పత్తి కేంద్రానికి మంజూరైన పట్టా పాస్‌బుక్‌ను అధికారులకు కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి ఆమె రెవెన్యూ, భూగర్భజల, మైనింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇసుక అక్రమరవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రాంతాలలోనే రాయల్టీ రుసుము చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని వాగులు, నది పరివాహక ఇసుక త్రవ్వకాల ప్రాంతాలను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్లు ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఇళ్ల నిర్మాణ అనుమతులు పంచాయతీ కార్యదర్శుల ద్వారా మంజూరు చేసి ఆ నిర్మాణాలకు అవసరమగు ఇసుకకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా అనుమతులు ఇప్పించాలన్నారు. ఇసుక అక్రమంగా రవాణా చేసిన, నిల్వ ఉంచిన వెంటనే చట్ట ప్రకారం జరిమానాలు విధించడం, కేసులునమోదు చేయడం, వాహనాలను జప్తు చేయాలన్నారు. అధికారులంతా ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. రెవెన్యూ అధికారులు పోలీసుశాఖ వారి సమన్వయంతో ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. ఇసుకతో పాటు మొరం అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీ మైన్స్ రవీందర్, డీపీవో శ్రీనివాస్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డిలు, తహసీల్దార్లు, భూగర్భ జల, మైనింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసుశాఖలో పని చేసే వారు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ విధులను నిర్వహించాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. శనివారం కొత్తగా పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వారి పనితీరుపై సమీక్ష జరిపారు. తమకు కేటాయించిన విధులను తూచా తప్పకుండా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని పేర్కొన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. మహిళలు, పురుషులన్న తేడా లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. పోలీసుశాఖలో ఉద్యోగం చేయడమంటే ఎన్నో సవాళ్లతో కూడుకుందన్నారు. శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటేనే సమర్థసేవలు అందించగలుగుతారన్నారు. విధులు నిర్వహించే సమయంలో సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నీతి, నిజాయితీతో ఉంటేనే సరైన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. నూతన పోలీసుల ప్రతిభను ఎస్పీ ప్రశంసించారు. అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.



సమీక్ష జరుపుతున్న ఎస్పీ జానకి షర్మిల

అమిత్ షా వ్యాఖ్యలను వక్రీకరిస్తున్న కాంగ్రెస్ : బీజేపీ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇటీవల పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ వక్రీకరిస్తూ ఎస్సీఎస్టీలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మొద టి నుంచి అంబేద్కర్‌ను అవమాన పరిచిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. అంబేద్కర్‌ఫోటో సైతం పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో పెట్టకుండా అడ్డుకున్నది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. అంబేద్కర్ ఆశయసాధన ధ్యేయంగా ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తూ ఆయన ఆకాంక్షలు నెరవేరుస్తున్నారన్నారు. ప్రజలను తప్పుదోవ పటిస్తూ బీజేపీని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందదన్నారు.



రావుల రాంనాథ్

రేపు నిరుద్యోగ యువతకు జాబ్ మేళా

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిరుద్యోగ యువతకు సోమవారం ఉదయం 11 గంటలకు డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పన శాఖ అధికారి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ రంగంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతలు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని పదో తరగతి ఆపై చదివిన 18-35 ఏళ్లలోపు వారు హాజరు కావచ్చునని తెలిపారు. వివరాలకు 9390227923, 9441535253 నెంబర్లను సంప్రదించాలన్నారు. బోథ్, నేరేడిగొండ వాసులకు 5 పోస్టులున్నాయన్నారు.

మాజీ సర్పంచ్

కుటుంబానికి పరామర్శ

నిర్మల్ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మండలంలోని భాగ్యనగర్ గ్రామ మాజీ సర్పంచ్ తోడిశెట్టి గంగారాం మాతృమూర్తి రాజవ్వ ఇటీవల మృతి చెందడంతో గంగారాం, వారి కుటుంబ సభ్యులను శనివారం నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, భాజపా నాయకుడు వి.సత్యనారాయణ గౌడ్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట భాజపా నాయకులు బషీర్‌అలీ, నంద ముత్యం, మాజీ సర్పంచ్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చవద్దు

కుంటాల, డిసెంబరు, 21: (ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యలను తగలబెట్టవద్దని వ్యవసాయాధికారులు సూచించారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాలలో వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి కొయ్యలను తగలబెట్టడం వలన కలిగే అనార్థాలను రైతులకు వివరించారు. రైతులు పంట పొలాల్లో వరి కొయ్యలను తగలబెట్ట కూడదని సూచించారు.

లబ్ధిదారులకు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నియోజకవర్గంలోని 37 మంది లబ్ధిదారులకు శనివారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. సీఎం సహాయనిధి ద్వారా అందించే ఆర్థిక సహాయం పేదప్రజలకు లబ్ధి చేకూర్చుతుందని శ్రీహరిరావు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తోందన్నారు. సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాది, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, పలువురు నాయకులు పాల్గొన్నారు.



బ్యాంకు పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం

బ్యాంకుల్లో భద్రతా చర్యలు పాటించాలి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో భద్రతా చర్యలు కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. సీసీటీవీలు, మోషన్స్ సెన్సార్, అత్యాధునిక అలారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఇటీవల అంతరాష్ట్ర దొంగల ముఠా దొంగతనానికి యత్నించగా బ్యాంకు సిబ్బందితో భద్రత చర్యలపై, ఏర్పాటుపై ఎస్పీ సమీక్షించి ఘటన స్థలాన్ని పరిశీలించారు సిబ్బందితో పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు జిల్లా మేనేజర్లు, రీజినల్ మేనేజర్ ఆధ్వర్యంలో భద్రతా, చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, డి.సాయినాథ్, ఎ.వెంకటేశ్వరరావ్, జర్వ్ ఇన్‌స్పెకర్ డి.వెంకటి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ అధికారి ప్రభుదాస్, జిల్లాలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఆయా ప్రభుత్వ శాఖ ఉద్యోగులకు సీఎం కప్ పోటీల్లో భాగంగా నిర్వహించిన క్రీడ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించగా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు క్రీడ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు సర్టిఫికెట్‌లు ప్రధానం చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ తిరుమల, డీవైఎస్ఓ, క్రీడ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులపై యువకుడి ఆగ్రహం!!

● సోషల్ మీడియాలో వైరలవుతున్న వీడియో

ఇచ్చోడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎంత తిరిగినప్పటికీ.. అసలే పనులు కాకపోవడంతో అధికారులపై ఓ యువకుడు ఆగ్రహం వ్యక్తం చేసిన వీడియో సోషల్ మీడియాలో గురువారం హల్‌చల్ చేసింది. ఇచ్చోడ లేబర్ ఆఫీసులో అధికారులు డబ్బులకు అలవాటు పడి నిరుపేద శ్రామికులకు అందల్సిన పథకాలను దూరం చేస్తున్నారని ఓ యువకుడు కార్యాలయంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు లేబర్ యాక్ట్ ప్రకారం రావాల్సిన నిధులు అందకపోవడంతో లేబర్ ఆఫీసులో సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. తమ తరఫున డబ్బులు అడుగుతున్న మధ్యవర్తిని నిలదీస్తూ ప్రశ్నించాడు. ఈ విషయమై కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా.. ఎవరో బయటివారు కావాలనే ఈ వీడియో తీశారని.. లేబర్ ఆఫీసులో ఎలాంటి డబ్బులు ఎవరినీ అడగలేదని.. కార్మికుల పనుల రిజిస్ట్రేషన్లలో కాస్తా ఆలస్యం కావొచ్చినా.. ఆఫీసులో మాత్రం పనులు తొందరగా సాగుతున్నాయని వివరించారు. ఏది ఎలా ఉన్న కూడా కార్మిక శాఖ ఉన్నతాధికారులు సోషల్ మీడియాలో వైరలవుతున్న వీడియో తీరును పరిశీలించి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని మండల కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

● 'భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

ఇచ్చోడ(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లెపల్లి గంగయ్య అన్నారు. శనివారం లేబర్ ఆఫీసులో సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. అర్హులైన ప్రతీఒక్కరికి లేబర్ కార్డులు ఇవ్వాలని, లేబర్ కార్డు జారీలో దళారీ వ్యవస్థలను అరికట్టాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలి

● గణితశాస్త్ర దినోత్సవంలో ఎంఈవో పోశెట్టి



బోథ్‌లో విద్యార్థులు గణితంపైన తయారుచేసిన బోధనోపకరణాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

బోథ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచి గణితంపైన పట్టు సాధించి ఉన్నతులుగా ఎదగాలని ఎంఈవో పోశెట్టి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో నిర్వహించిన గణిత శాస్త్ర దినోత్సవ కార్యక్రమానికి హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితశాస్త్రం జీవితానికి ముడిపడి ఉందన్నారు. శ్రీనివాస రామానుజన్ గొప్ప గణిత శాస్త్రవేత్తని ఆయన గణితంపైన ఎన్నో పరిశోధనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషోర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే, సోనాల మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో ఘనంగా గణిత దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణితంపైన తయారు చేసిన బోధన ఉపకరణాలను ప్రదర్శించారు. ఆయన చేసిన గణితాభివృద్ధి మరువలేనిదన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాంద్రాబాబాపూర్ పాఠశాలలో శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలకు ఎంఈవో ఆశన్న ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించారు.

● విద్యార్థులకు బహుమతుల ప్రదానం

తలమడుగు(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.రామేశ్వర రావు అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగ్గులు వేసి గణిత సూత్రాలను ప్రదర్శించారు. పాఠశాల గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

● ఉట్నూర్‌లో ఘనంగా గణిత దినోత్సవం

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ పాఠశాలల్లో శనివారం రామానుజం జయంతి సందర్భంగా ఘనంగా గణిత దినోత్సవం నిర్వహించారు. ఉట్నూర్ మండలంలోని సాలెవాడ పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు రవికుమార్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 22, 1887లో జన్మించిన గణితపితామహుడు రామానుజం 1920లో మృతి చెందారన్నారు. 33ఏళ్ల జీవిత కాలంలో ఎన్నో సూత్రాలు గణిత ప్రతిష్టను పెంపొందించారన్నారు.

● పాఠశాలల్లో గణిత దినోత్సవ వేడుకలు

ఇచ్చోడ(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ముందస్తు గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని గోల్డెన్‌లీఫ్ పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం వివిధ ప్రదర్శనలు చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై తిరుపతి మాట్లాడుతూ.. పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే గణితంలో పట్టు సాధించాలని విద్యార్థులకు ఆయన ఈ సందర్భంగా సూచించారు.

పోలీసులపై దాడి.. సీఐకి గాయాలు

● రిమ్స్ ఆసుపత్రికి తరలింపు

గుడిహత్నూర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పోలీసులపై దాడి ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఓ యువకుడు బాలికతో కలిసి ఉండగా స్థానికులు గదిలో బంధించారు. కూలీ పనులకు వెళ్లిన బాలిక తల్లిదండ్రులు ఇంట్లో తమ కూతురు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బంధించిన యువకుడిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ యువకుడిని తమకు అప్పగించాలని బాలిక తల్లిదండ్రులు, బంధువులు పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఇచ్చోడ సీఐ భీమేష్, గుడిహత్నూర్ ఎస్సై మహేందర్, పలువురు పోలీసులు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. పరిస్థితిని ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, ఇచ్చోడ ఎస్సై తిరుపతిలు సమీక్షిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో గాయాలై బాలుడి మృతి

ఇంద్రవెల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో తీవ్ర గాయాలైన విద్యార్థిని మసురే వీరేందర్ హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలకేంద్రంలోని భీంనగర్‌కు చెందిన మసురే సంతోష్, సుకేష్న దంపతుల ఏకైక కొడుకు వీరేందర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలతో హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో 44 రోజులు ప్రాణాలతో పోరాడి పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'బూటకపు హామీలతో కాంగ్రెస్ మోసం'

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు అమలవుతున్న ప్రభుత్వ పథకాలపై బీఆర్ఎస్ నేతలు గ్రామాల్లో సమగ్ర సర్వే జరుపుతున్నారని, బూటకపు హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే పలు గ్రామాల్లో సర్వే చేపట్టడం జరిగిందని, ఈ సర్వేలో రైతులు రుణమాఫీ విషయంలో తీవ్ర అన్యాయానికి గురైనట్లు సర్వే స్పష్టం చేస్తోందని వివరించారు. ఇందులో గంద్రత్‌రమేష్, సాజిదొద్దిన్, రాజన్న, సేవ్వజగదీశ్, కుమ్రరాజు,పరమేశ్వర్, అష్కమ్‌గంగయ్య, బట్టుసతీష్, ఉగ్గే విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చాలీసా పారాయణం

బోథ్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సోనాల మండల కేంద్రంలోని రామాలయంలో 53 శనివారాలు హనుమాన్ చాలీసా పఠనం కొనసాగింది. హిందూ జనశక్తి ఆధ్వర్యంలో ప్రారంభమైన చాలీసా పారాయణం ఒక సంవత్సరాన్ని 53 వారాలు పూర్తి చేసి శనివారంతో ముగించారు.కాగా, భక్తిశ్రద్ధలతో ప్రతీ శనివారం కొనసాగిన హనుమాన్ చాలీసా పారాయణం వల్ల ధైర్యం, తేజస్సు, ఆధ్యాత్మిక భావన, ఏకాగ్రత పెరుగుతుందని హిందూ జాగరణ సమితి సభ్యులు పేర్కొన్నారు.

భక్తితోనే మనసుకు ప్రశాంతత

తాంసి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): భక్తి వల్ల మనసుకు శాంతి లభిస్తుందని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జయసింగ్ రాథోడ్ అన్నారు. మండలంలోని వడ్డాడిలోని స్వయంభు లింబద్రి నరసింహస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి విజ్ఞేష్ ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

దశాబ్దాలు గడుస్తున్నా.. దశ మారని సీఆర్టీల బతుకులు

(5వ పేజీ తరువాయి...)

సౌకర్యం కల్పించాలని, 61ఏళ్లు నిండిన సీఆర్టీలకు రూ.20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, సీఆర్టీలు అందరికీ ఆరోగ్య కార్డులు ఇవ్వాలని సీఆర్టీలు డిమాండ్ చేస్తున్నారు.

మహిళలకు ప్రసూతి సెలవులేవీ?

ప్రభుత్వ విభాగాలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులతో పాటు అధికారుల స్థాయి వరకు ప్రసూతి సెలవులతో పాటు పలు రకాల బెనిఫిట్స్ ఇస్తున్న ప్రభుత్వం.. మహిళా సీఆర్టీలకు మాత్రం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వక పోవడంతో వారు ఆర్థికంగా నష్టపోతున్నామంటున్నారు. ప్రభుత్వ విభాగంలో పని చేస్తున్న మహిళల మాదిరిగానే తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే విధులు నిర్వహిస్తున్నందున 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, మహిళా సీఆర్టీల పిల్లల సంరక్షణ కోసం వేతనంతో కూడిన చైల్డ్ కేర్ లీవ్స్ ఇవ్వాలని పలువురు మహిళా సీఆర్టీలు కోరుతున్నారు.

మూతపడుతున్న పాఠశాలలు!!

ఒకవైపు ఉన్నతాధికారులు పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు రావాలంటూ ప్రణాళికలు అమలు చేస్తుండగా.. మరోవైపు సీఆర్టీలో ఉద్యమబాట పట్టడంతో అధికారుల ప్రణాళికలకు బ్రేక్ పడేలా కనిపి స్తోంది. ఆశ్రమ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల్లో రెగ్యూలర్ వారి కంటే ఎక్కువ సీఆర్టీలే ఉన్నారు. ఫిజికల్ సైన్స్ గణితం, తెలుగు, సోషల్ లాంటి సబ్జెక్టులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఎంతో మంది ఉన్నారు. వీరు ఆందోళనబాట పట్టడంతో విద్యార్థుల పరిస్థితి అయోమయంలో పడింది. దీనికి తోడు ఉమ్మడి జిల్లాలో 41 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా.. 920 గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు పని చేస్తున్నాయి. ఇవి పూర్తిగా ఏకోపాధ్యాయ పాఠశాలలు. అయితే జిల్లాలో 23 స్కూల్ కాంప్లెక్స్‌లలో 489 ఏకోపాధ్యాయ పాఠశాల లు ఉండగా.. 155 ప్రాథమిక పాఠశాలలు సీఆర్టీల ఉద్యమంతో మూతబడ్డాయి. పాఠ శాలలు మూతబడడంతో గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సీఆర్టీల సమస్యలు నెరవేరేలా సంఘీభావం తెలుపుతామని ప్రకటిస్తున్నారు. ఏదిఏమైనా ప్రభుత్వం సీఆర్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పరిశీలకులు అంటున్నారు.

సర్వశిక్షాభియాన్ ఉద్యోగుల నిరసన

కాగా, ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ విద్యాధికారి కార్యాలయంలో పని చేస్తున్న సర్వశిక్షాభియాన్ ఉద్యోగులు సైతం తమ సమస్యల పరిష్కారం కోసం గత కొన్ని రోజులుగా నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారు. ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం కావడం వల్లనే ఉద్యోగులు ఆందోళనలు చేయాల్సి వస్తోందని.. ప్రభుత్వం ఇప్పటికైనా సర్వశిక్షాభియాన్ ఉద్యోగుల సమస్యలు సామరస్యంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

కారు, బైకు ఢీ : ఇద్దరికి గాయాలు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాల పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఈద్గా వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం, కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడింది. మరోవైపు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కుమ్ర శ్రీకాంత్, షేక్ సోహెల్‌కు గాయాలు కాగా స్థానికులు రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా.. పోలీసులు దర్యాప్తు చేపడుతున్నామని పేర్కొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వే

తలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేసి నిర్మించుకునేందుకు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వే పనులు మండలంలో పకడ్బందీగా సాగుతున్నాయి. అధికారితో సహా నూతనంగా నియమించబడ్డ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ప్రతీ ఇంటింటికి వెళ్లి సర్వే పనులను చేపడుతున్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో. కమిటీ సభ్యులు, అధికారులు ఆన్‌లైన్ ఇంటింటి సర్వే పనులను చేపట్టారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు,అధ్యాపకులు

భైంసా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాంత్రిక జీవన విధానాలతో ఎదుర్కొంటున్న ఒత్తిడులను ధ్యానం చేయడం ద్వారా దూరం చేసుకోవచ్చునని గోపాల్‌రావ్ పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జె.భీమారావ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. నేటి పోటీతత్వ యుగంలో అందరి జీవన విధానాలు ఉరుకులు, పరుగుల మీద కొనసాగుతున్నాయని వెల్లడించారు. అనేక ఒత్తిడులతో అందరూ మానసిక ప్రశాంతతకు దూరమై రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. పనిభారంతో విశ్రాంతి సైతం కరువవుతోందన్నారు.

ఇలాంటి వాటన్నింటి నుంచి ఉపశమనం పొందేందుకు ఏకైకమార్గం ధ్యానమేనని వివరించారు. ప్రశాంత జీవనం కోసం ప్రతీ ఒక్కరూ నిత్యం క్రమం తప్పకుండా ధ్యానం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, ఆధ్యాపక బృందం ధ్యానం చేసి అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంపై ప్రదర్శలు చేపట్టారు. ఇందులో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆరే రాజు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

దస్తూరాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట శనివారం కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్మికుల నిరంతర శ్రమను దోపిడీ చేయకుండా వారి శ్రమకు తగిన వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందులో మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు.

వారధి నిర్మాణానికి కదిలిన అడవిబిడ్డలు

● స్వచ్ఛందంగా దొత్తి వాగుపై తాత్కాలిక వంతెన నిర్మాణం

● సొంతంగా రోడ్డు నిర్మాణం చేసుకున్న గిరిజనులకు పలువురి అభినందన



పెంబి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎవరో వస్తారని, ఏదో చేస్తారని... ఆశించక తమకు కావలసిన మార్గాన్ని సుగమం చేసుకునేందుకు అడవి బిడ్డలంతా కదిలి వారధి నిర్మాణం చేసుకున్న స్ఫూర్తి దాయక ఘటన పెంబి మండలంలో చోటుచేసుకుంది. పెంబి మండల కేంద్రం నుంచి రాంనగర్, యాపల్‌గూడ, సత్తుగూడ, దేందారి, నాయకపుగూడ, వస్‌పెల్లి, చాకిరేవు, తదితర గ్రామాలకు వెళ్లాలంటే దొత్తి వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. నిత్యం ఏదో ఒక పని నిమిత్తం మండల కేంద్రానికి రావలసిన పరిస్థితి తప్పని ఆదివాసీలు కనీసం రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాము పండించిన పత్తి ఇతరాత్ర పంటలను అమ్ముకునేందుకు మార్కెట్‌కు తరలించాలన్నారు. వాగు దాటి రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తమ సమస్యను తామే పరిష్కరించుకునేందుకు తాత్కాలిక వంతెన నిర్మాణానికి ఆదివాసి బిడ్డలంతా కలిసికట్టుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ప్రస్తుతం దొత్తి వాగులో వరద ఉధృతి తగ్గిన నేపథ్యంలో శనివారం దొత్తి వాగుపై తాత్కాలిక వంతెనను నిర్మించుకున్నారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తాత్కాలిక పరిష్కారాన్ని వెతుక్కునేందుకు ఆదివాసి గిరిజనులు చేసిన కృషిని పలువురు అభినందిస్తున్నారు.

విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ వహించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు



విద్యార్థులకు అందించే పౌష్టికాహారం గురించి వివరిస్తున్న జిల్లా విద్యాధికారి పి. రామారావు



తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి పి. రామారావు

సోన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు సూచించారు. నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతీ నెల మూడో శనివారం నిర్వహించే తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతీనెలలో జరిగే తల్లిదండ్రుల సమావేశానికి తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో హాజరు కావాలన్నారు. సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులు విద్యార్థుల విద్యా ప్రగతి, వారి ఆరోగ్య వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి వద్ద విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను స్వయంగా తనిఖీ చేసి, సిలబస్ పూర్తి గురించి వాకబు చేయాలని కోరారు. విద్యార్థులకు కంటి పరీక్షల వంటి ఆరోగ్య పరీక్షలు కూడా ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో వైద్య అధికారులచే చేయించాలని, దాతలను సంప్రదించి విద్యార్థులకు అవసరమయ్యే ఆట వస్తువులు, తగరతి గదులలో, గోడలపై బొమ్మలు, టై, బెల్టులు మొదలైన సౌకర్యాలను గూర్చి చర్చించి దాతల ద్వారా సమకూర్చుకోవాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. విద్యార్థులు కూడా ఉపాధ్యాయులు చెప్పే విషయాలను చక్కగా అవగాహన చేసుకోవాలని. తమ ప్రగతిని ఏ రోజుకారోజు తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. తల్లిదండ్రులు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతీరోజు తల్లిదండ్రులలో ఒకరు భోజనం రుచి చూసి తమ అభిప్రాయాలను ఉపాధ్యాయులకు తెలియజేయాలని, రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా వండుతున్న వంటను పరిశీలించి మెనూ ప్రకారం శుభ్రతగా, రుచిగా వండాలని వంట సిబ్బందికి సూచించారు. వంట వండినప్పుడు తలకు స్కార్ఫ్, ఒంటికి ఆప్రాన్, చేతికి గ్లౌజులు ధరించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం బిల్లులు త్వరలో అందనున్నట్లు వారికి తెలియజేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి

● ఎన్నికల హామీలు అమలు చేయాలి ● ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్



మాట్లాడుతున్న ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందిని పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయాలని లేదా వారికి సొసైటీ ఏర్పాటు చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత 12 రోజులుగా జిల్లాకేంద్రాల్లో ఉద్యోగుల ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగుతుండగా, దీక్ష శిబిరానికి వెళ్లి వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెండు దశాబ్దాల కాలంగా ఉద్యోగ భద్రత లేకుండా, అనేక సమస్యలతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, వారికి వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఆ ప్రక్రియ ఆలస్యమైన పక్షంలో మినిమం బేసిక్ పే విధానం వెంటనే అమలు చేయాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వంలో వారి సమస్యలు పరిష్కారం అవుతాయని ఎన్నో ఆశలతో ఉన్నారన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేరే వరకు వారికి ఎస్‌టీయూ పక్షాన అండగా నిలుస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా వెట్టి చాకిరి చేస్తూ అన్యాయానికి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. భూమన్న యాదవ్, జే. లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి టి. గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్

ముథోల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంప్రదాయ ఆహార పదార్థాలను అలాగే ఆరోగ్యకరమైన పౌష్టికా హారాలను ప్రదర్శించారు. ప్రదర్శించిన తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్‌లో ఎంఈవో రమణారెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సాయరెడ్డి, సునందాదేవి, ఉపాధ్యా యులు, పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

కుభీర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌లోని చాణక్య సంస్కృతి పాఠశాలలో శనివారం ఫ్రూట్స్‌డేను నిర్వహించినట్లు డైరెక్టర్ సతీష్ తెలిపారు. ప్రైమరీ విద్యార్థులకు ఫ్రూట్స్ వలన కలిగే లాభాలను తెలియజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

దస్తురాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి గంగాధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట వేణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల, డిసెంబరు, 21: (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలతో పాటు కల్లూర్ హైస్కూల్‌లలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటి వద్ద తయారు చేసిన పలు రకాల వంట కాలను ఫుడ్ ఫెస్టివల్‌లో విక్రయించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, వాణిజ్య పరమైన ఆలోచన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉంది

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్(జి) హైస్కూల్ విద్యార్థులు అస్వస్థతకు గురై చికిత్స పొందిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది కోలుకున్నారని డీఈవో రామారావు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. శృతి, మహీన్ అనే విద్యార్థులు శ్వాస ఆడక పోయారు. వీరిలో రక్తహీనత, కాల్షియం లోపం ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడి నివేదిక మేరకు విద్యార్థులను తల్లిదండ్రులతో కలిసి వారి గ్రామానికి పంపించామని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఆలయంలో డీసీసీ అధ్యక్షుడి పూజలు



నిర్మల్ కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని దేవరకోట ఆలయంలో శనివారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు దైవదర్శనం చేసుకున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఆశీర్వదించి, ప్రసాదం అందజేశారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

మన్మథ్ పాఠశాలలో టీఎల్‌ఎం మేళా

ముథోల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల మన్మథ్‌లో శనివారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన టీఎల్ఎంను తయారు చేశారు. టీఎల్ఎం మేళాలో భాగంగా విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ మేళాను వీక్షించారు. ఇందులో భాగంగానే ఫుడ్ ఫెస్టివల్ కూడా నిర్వహించారు. వివిధ రకాల వంటకాలను తయారు చేసుకొని ప్రదర్శించారు.



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

ఘనంగా ముగిసిన భోరిగాం జాతర

నిర్మల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తానూరు మండలంలోని భోరిగాం గ్రామంలో ఆంజనేయ స్వామి జాతర శనివారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ఉదయాన్నే స్వామి వారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహా హారతి కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులతో పాటు మండలంలోని ఆయా గ్రామాల, చుట్టు పక్కల మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటైన పలు దుకాణాల్లో తినుబండరాలు, ఆట వస్తువులను విక్రయించారు. జాతరకు వచ్చిన భక్తులకు గ్రామ కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ కుస్తీ పోటీలకు మండలంలోని గ్రామాలతో పాటు, మహారాష్ట్రలోని ఆయా గ్రామాల నుంచి మల్లయోధులు వచ్చి పాల్గొన్నారు. ఈ కుస్తీపోటీల్లో పాల్గొని విజయం సాధించిన మల్లయోధులకు మొదటి బహుమతిగా రూ. 10,001, రెండవ బహుమతి రూ. 7501 ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అందించారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై రమేష్ నేతృత్వంలోని పోలీసు సిబ్బంది భారి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పాటిల్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, నాయకులు శివాజీ పటేల్, పోతారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పల్లె విఠల్, బొడ్డొల్ల బాబు, గణేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠాపన



బాసర గ్రామంలో మంగళహారతులతో మహిళల శోభాయాత్ర

బాసర, డిసెంబరు, 21: (ఆంధ్రజ్యోతి): బాసర మండల కేంద్రంలోని పాపహారేశ్వర ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. పురాతన శివాలయాన్ని నూతనంగా నిర్మించి ఈ మహోత్సవాన్ని గ్రామస్థులు జరిపారు. నూతన దేవతా మూర్తులు గణపతి, సంతాన నాగేంద్రుడు, అన్నపూర్ణదేవి, నందీశ్వరుడు, కాల భైరవుడు, వీరభద్రుడు, నవగ్రహాలకు గంగనీళ్లతో అభిషేక పూజలు నిర్వహించి వేద పండితుల మంత్రోశ్చరణాల మధ్య ప్రతిష్ఠించారు. రుద్రాభిషేకం, బిల్వార్చన, చండిహోమం, వంటి వివిధ పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతీ ఇంటి మహిళలు మంగళహారతులతో శోభయాత్రగా వెళ్లి నూతన ఆలయంలో పూజలు నిర్వహించారు.

కన్నుల పండువగా ఆది దంపతుల కల్యాణం



ఆది దంపతుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నర్సాపూర్(జి), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దేవుడి చెరువు మల్లికార్జున భ్రమరాంబిక స్వామి ఆలయంలో శనివారం ఆది దంపతుల కల్యాణం వేద పండితులు నరహరి శర్మ, చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నిమ్మ సుశీల రాములు దంపతులు కల్యాణం పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం జరగబోయే జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనబడితే, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఎస్సై సాయికిరణ్ చరవాణి నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. వాహనదారులకు డస్ట్ కంట్లో పడకుండా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రోడ్డుపై నీటిని ట్యాంకర్ ద్వారా అందించారు. పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా వన్ వే ఏర్పాటు చేసి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఘనంగా వీర హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

కుంటాల, డిసెంబరు, 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాలలో వీర హనుమాన్ 9వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామికి అర్చన, అభిషేకం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గజేందర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



కుంటాల హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఇరుకు గదిలో గ్రంథాలయం

• పాఠకులకు ఏకాగ్రత కరువు • గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించాలని వేడుకోలు



నేరడిగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠకులకు అదనపు విజ్ఞానం అందని ద్రాక్షగా మారింది. గ్రంథాలయం ఇరుకు గదిలో ఉండడంతో పాఠకులకు ఏకాగ్రత కొరవడింది. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి సొంత భవనం కరువైంది. సొంత భవనం లేకపోవడంతో గ్రంథాలయం పాత గ్రామ పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన అదనపు గదుల్లో కొనసాగుతుంది. ఒక చిన్న గదిలో పుస్తకాలను నిల్వ చేసి మరో గదిలో పాఠకులకు చదివిస్తున్నారు. ఇరుకైనా హాల్‌ను దినపత్రికల పఠనానికి వినియోగిస్తున్నారు. స్థలం లేకపోవడంతో టెలివిజన్ ను వినియోగించడం లేదు. మండల కేంద్రంలో గ్రంథాలయం 1986లో మంజూరైంది. అప్పటి నుంచి గ్రంథాలయం అవస్థల మధ్యనే కొనసాగుతుంది. గ్రంథాలయంలో పుస్తకాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఎప్పుడో ఏళ్ల క్రితం సరఫరా చేసిన పుస్తకాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అందుబాటులో లేవు. గ్రంథాలయినికి సొంత భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, గ్రంథాలయానికి అన్ని రకాల పుస్తకాలను సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గ్రంథాలయంలో దినపత్రికలు చదువుతున్న పాఠకులు

సొంత భవనం నిర్మించాలి

●జాదవ్ వసంత్‌రావు, బుగ్గారాం



గ్రంథాలయానికి సొంత భవనం లేక పోవడంతో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇరుకైన గదిలో కొనసాగుతుంది. దినపత్రికలు కూడా చదువు కోవడానికి ఇబ్బందిగా ఉంది. గ్రంథాలయానికి సొంత భవనం నిర్మిస్తే పాఠకులకు అనువుగా ఉంటుంది. గ్రంథాలయం ఇరుకుగదిలో ఉండడం వల్ల ఏకాగ్రత కొరవడుతుంది.

అన్ని రకాల పుస్తకాలను సరఫరా చేయాలి

● శాడిగా ప్రదీప్, తేజాపూర్



గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. ఉద్యోగ వేటలో ఉన్న నిరుద్యోగులు పరీక్షలకు సన్నద్ధం కావడానికి అవసరమయ్యే పుస్తకాలను సరఫరా చేయాలి. సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

స్థల సేకరణ చేస్తే బిల్డింగ్ కట్టిస్తాం

● శ్రీకాంత్, గ్రంథాలయ అధికారి, నేరడిగొండ



స్థల సేకరణ చేస్తే ఉచిత భవన నిర్మాణం చేయడానికి నిధులు ఉన్నాయి. ఈ నిధులు రాజారాం లైబ్రరీ ఫౌండేషన్ ద్వారా నిధులు వస్తాయి. స్థలం చూపించడమే ఆలస్యం భవన నిర్మాణం వెంటనే చేపడతాం.

అలరించిన జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు

భైంసా, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం శ్రీనివాస రామనుజన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన ముందస్తు గణితశాస్త్ర దినోత్సవ వేడుకలు అహూతులను అలరారించాయి. ఈ సందర్భంగా రామనుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ రామనుజన్ చిన్నతనంలోనే గణిత శాస్త్రంలో పెద్ద పెద్ద సమస్యలు సాధించి ఉపాధ్యాయులను అబ్బురపరిచారన్నారు. రామనుజన్ మేధస్సును మెచ్చుకొని బ్రిటీష్ ప్రొఫెసర్ జిహెచ్ హెడ్లి లండన్ విశ్వవిద్యాలయంలో స్థానం కల్పించారని అన్నారు. విద్యార్థులు రామనుజన్‌ను ఆదర్శంగా తీసుకొని చదవాలని అన్నారు. వేడుకలలో భాగంగా స్థానిక ఆల్ఫోర్స్ హైస్కూల్‌లో విద్యార్థులు శ్రీనివాస రామనుజన్ ముఖ ఆకారంలో, అంకెల ఆకారంలో చేపట్టిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలు పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

విజయ హైస్కూల్‌లో..

నిర్మల్ అర్బన్: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్మల్‌లోని విజయ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాలయం కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణితానికి చేసిన సేవలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యాలయం ప్రిన్సిపాల్ సామ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భారత దేశ గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ ఆర్యభట్ట, ఇతర శాస్త్రజ్ఞులు గణితానికి చేసిన సేవలను గురించి వివరించారు. విద్యార్థులు కూడా శ్రీనివాస రామానుజన్ అడుగుజాడల్లో నడవాలని తెలిపారు. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ హైదరాబాద్ వారు నిర్వహించిన మ్యాథ్స్ అండ్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో విజయ స్కూల్‌కు చెందిన 51 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను విద్యాలయం కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముథోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల, రబీంద్ర, అక్షర, మండలంలోని ఎడ్‌బిడ్ ఫ్యూచర్ కాన్సెప్ట్, వివేకానంద, శ్రీవిద్య, భాష్యంతో పాటు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో శనివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులు గణిత నమూనాలు ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నమూనాలను ఎంఈవో రమణారెడ్డితో పలువురు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామానుజన్ 13 ఏళ్లకే త్రికోణమితి థియరీలను రాసిన మేధావి మహా మేధావులకు మాత్రమే సాధ్యమయ్యే సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సహాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్లు సాయినాథ్, సుభాష్, మాధవ్ రావు, ప్రవీణ్ కుమార్, సంతోష్, ఆనంద్, సారధి రాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంకెల ఆకారంలో ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు



శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం



ఎడ్‌బిడ్ ఫ్యూచర్ స్కూల్‌లో చిన్నారులు..



ముథోల్‌లోని రబీంద్ర పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం

ఉద్యోగులుగా కాదు.. సృష్టికర్తలుగా మారాలి

● ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీదర్శన్ ● ఆర్జీయూకేటీలో అవగాహన కార్యక్రమం





అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, మాట్లాడుతున్న ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీ దర్శన్

బాసర, డిసెంబరు, 21(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీలో వ్యవస్థాపకత అవగాహన కార్యక్రమాన్ని ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు నిర్వహించారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళిదర్శన్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యవస్థాపక ఆవిష్కరణలు ప్రోత్సహించే ప్రయత్నాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడిందని తెలిపారు. విశ్వ విద్యాలయ ఆవిష్కరణ వ్యవస్థాపక సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాయల సమన్వయ కర్త కార్యక్రమం నిపుణులు ఐఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగులుగా కాకుండా సృష్టికర్తలుగా మారాలని చెప్పారు. నేటి వేగవంతమైన ఆర్థిక వ్యవస్థలో వ్యవస్థాపకత ప్రాముఖ్యతను విద్యార్థులు తమ కేరీర్‌లో విజయం సాధించేందుకు వినూత్నంగా ఆలోచించాలని, వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన ప్రోత్సహించారు. విద్యార్థులను వారి అభిరుచులను తెలుసుకుంటనే సమాజంపై సానుకూల ప్రభావాన్ని సృష్టించగల వినూత్న వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేయడానికి ప్రేరేపించారు. ఎంటర్‌ప్రెన్యూర్ షిప్, కేరీర్ డెవలప్‌మెంట్‌పై మార్గదర్శకత్వం కోరుతూ ప్రశ్నోత్తరాల సెషన్‌లో చురుకుగా పాల్గొన్న విద్యార్థుల నుంచి చర్చకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్స్ డాక్టర్ విట్టల్, డాక్టర్ మహేష్, డాక్టర్ చంద్రశేఖర్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి లేదు.. పొడి లేదు

● అలంకార ప్రాయంగా సెరిగేషన్ షెడ్లు



పలు గ్రామాల్లో అలంకారప్రాయంగా ఉన్న సెరిగేషన్ షెడ్లు

తలమడుగు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం నిర్వహణ కోసం ప్రతీ గ్రామంలో లక్షల వ్యయంతో నిర్మించిన సెరిగేషన్ షెడ్లు అలంకార ప్రాయంగా ఉన్న సంబంధిత శాఖ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన సిరిగేషన్ షెడ్లలో తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా చేసి సేంద్రియ ఎరువులను తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారి చేసినప్పటికీ ఇక్కడ సేంద్రీయ చెరువులు తయారవుతున్నట్లు దాఖలాలు కనిపించడం లేదని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి, కొన్ని గ్రామాల్లో సెరిగేషన్ షెడ్లు అక్రమ కలపాలకు. అడ్డగా మారాయని పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామాలు ఏర్పాటు చేసిన. షెడ్లలో చెత్త వేయకపోవడంతో మద్యం ప్రియులకు. అడ్డాగా మారాయి. కాగా వాటిని పరిరక్షించాల్సిన అధికారులు పట్టించు కోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెరి గేషన్ షెడ్లలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి. సేంద్రియ ఎరువులను తయారు చేసి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీ మొక్కలకు అందేవిధంగా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

ఆశాజనకంగా శనగ పంట

తాంసి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం శనగ పంట ఆశాజనకంగా కనిపిస్తుంది. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం పంటకు కావలసిన రీతిలో వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. దీంతో ఈ సంవత్సరం శనగ పంటపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం శనగ పంటకు కావాల్సిన రీతిలో వాతావరణ పరిస్థితులు ఉండడంతో ఆశాజనకంగా కనిపిస్తుంది. కనీసం తమ కష్టాలను శనగ పంట అయిన తీరుస్తుందని ఆశతో ఉన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం శనగ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని చెప్పొచ్చు. మండలంలో ఈసారి సుమారు 3000 హెక్టార్లలో శనగ సాగు అవుతుంది. కొంతమంది రైతులు శనగ విత్తనాలు నాటి 30 నుంచి 35 రోజులు కావస్తుంది. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉండటంతో రైతుల ఆశలన్నీ శనగ పంటపైనే ఆధారపడి ఉన్నాయి. ఇంకా కొంతమంది వారి వారి చేలలో ఉన్న పత్తిని తొలగించి శనగ సాగుకోసం సన్నద్ధమవుతున్నారు. కనీసం శనగ పంట రైతన్నను ఆదుకోవాలని ఆశిద్దాం.




శనగ పంట

●పెరిగిన సాగు విస్తీర్ణం

గతంతో పోలిస్తే ఈ సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో శనగ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని చెప్పవచ్చు. మూడు నెలల ముందుగానే పత్తి పంట పూర్తి అవ్వడంతో రైతులు ఆ పత్తి పంటను తొలగించి శనగ సాగుకు సమాయత్తమవుతున్నారు. సుమారు 50 వేల హెక్టార్లలో సాగు అయ్యేలా కనిపిస్తుందని పలువురు పేర్కొంటున్నారు. మొత్తం మీద శనగ పంటపై రైతులు ఆసక్తి చూపడం, శనగ పంటకు మార్కెట్లో గిట్టుబాటు ఉండటంతో పాటు వారి వారి మండలాల్లో కొనుగోలు చేయడంతో ఈ పంటపై రైతులు మొగ్గుచూపుతున్నారని చెప్పొచ్చు.

వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలి

● ఎల్మ గంగారెడ్డి, రైతు తాంసి



ప్రస్తుతం శనగ పంట ఆశాజనకంగా కనిపిస్తుంది. పంటలపై చీడపీడల ప్రభావం అంతగా కనిపించడం లేదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉంది. అయితే పంటకు తెగుళ్ల సోకే సమయంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సకాలంలో స్పందించి తమకు సూచనలు అందించాలి. ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి.





ఉట్నూర్‌లో సీఆర్టీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

సీఆర్టీల సమ్మెకు రాజకీయ పార్టీల మద్దతు

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): గత 6రోజులుగా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న సీఆర్టీల సమ్మెకు రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం పలికారు. ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న సమ్మెకు బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్, జాదవ్ సుమన్ బాయి, కొండేరి రమేష్‌లు మద్దతు పలికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రావు మాట్లాడుతూ సీఆర్టీల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సీఆర్టీల వేతనాలు వెంటనే విడుదల చేయాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సంఘం నాయకులు గోడం శ్రీనివాస్, వినంత్‌రావు, సోమేశ్వర్, రమేష్, వంశీకృష్ణ, శంకర్, విజేష్, బాపురావు, బి.శ్రీనివాస్, మునినాయక్, బద్దులాల్, కమలాకర్, రాంచందర్, విద్యారాణి, వందనలు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొన్న మహిళ సీఆర్టీలు



- సకాలంలో వేతనాలు అందక సీఆర్టీలకు తప్పని తిప్పలు
- మహిళా సీఆర్టీలకు ప్రసూతి సెలవులు కరువు
- గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పెద్దఎత్తున ఖాళీలు
- పాలకులు మారినా.. మారని ఉపాధ్యాయుల పరిస్థితి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 1200మంది సీఆర్టీలు

దశాబ్దాలు గడుస్తున్నా..

దశ మారని బతుకులు!

ఉట్నూర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'గురు బ్రహ్మ గురు విష్ణు, గురు దేవో మహేశ్వర, గురు సాక్షాత్ పరబ్రహ్మ, తస్మైశ్రీ గురవే నమః అంటూ గురువులను దైవంగా భావిస్తాం. అలాగే, అమ్మ అడుగులు వేయడం నేర్పిస్తే.. నాన్న నడక నేర్పిస్తారు. గురువు జ్ఞానం బోధిస్తారు. మరి అలాంటి గురువులను ప్రభుత్వాలు సమస్యల్లోకి నెట్టి వేస్తున్నాయి. పాలకులు మారినా.. ఉపాధ్యాయుల బతుకులు మారడం లేదంటున్నారు. ఫలితంగా ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్సి టీచర్లు (సీఆర్టీ) తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలకు శ్రీకారం చుట్టారు.

మెరుగైన విద్యా బోధన కోసం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించడానికి ప్రభుత్వం దశాబ్దాల క్రితం 133 గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, 23 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో 920 ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి కొన్ని వేల మంది విద్యార్థులకు విద్య బోధన సౌకర్యం కల్పిస్తోంది. వేల మంది విద్యార్థులకు పాఠాలు బోధించడానికి ఉపాధ్యాయులను ప్రభుత్వాలు నియమించాల్సి ఉన్నప్పటికీ.. కాలం గడిపేస్తుండడంతో తాత్కాలిక ఉపాధ్యాయులుగా కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్లను 1200 మందికి పైగా నియమించి కాలం నెట్టుకొస్తున్నారు. ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ సీఆర్టీల ద్వారా విద్యబోధన కొనసాగిస్తున్నారు. 133 ఆశ్రమ పాఠశాలలు, శాటిలైటు సెంటర్లలో సీఆర్టీలు విధులు నిర్వహిస్తూ రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా.. వేతనాలు మాత్రం అంతంత మాత్రమే ఇస్తున్నారు.

సీఆర్టీల పాత్ర ఎంతో ముఖ్యం

గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి గత 20ఏళ్లుగా పని చేస్తున్న సీఆర్టీల పాత్ర ఎంతో ముఖ్యమైనది. రెండు దశాబ్దాలకు పైగా గిరిజన విద్య శాఖలో విద్య వ్యవస్థ మెరుగు పడడానికి కృషి చేస్తున్నారు. 2005 కంటే ముందు పదవ తరగతిలో 10 శాతం ఉన్న ఫలితాలు.. సీఆర్టీల రాకతో 95 శాతానికి పెరిగింది. 2016, 2023లలో సీఆర్టీలను క్రమబద్ధీకరిస్తామని అప్పటి ప్రభుత్వాలు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా చేసింది. ఇప్పటి వరకు క్రమబద్ధీకరించకుండా మినిమం టైం స్కేల్ అమలు చేయకుండా, సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలం గడిపేస్తూ ఉండడంతో సీఆర్టీలు ఆందోళన బాట పట్టారు.

సకాలంలో వేతనాలు అందక..

ప్రతీనెల ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం.. కాంట్రాక్ట్ రెసిడెన్సీ టీచర్లకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందుల పాలవుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతీనెల ఒకటో తేదీన వేతనం ఇవ్వాలని, సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాదాల బారీనపడి ప్రాణాలు కోల్పోయిన సీఆర్టీలకు రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ప్రావిడెంట్ ఫండ్

(తరువాయి 6వ పేజీలో...)

మహిళా సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి : పద్మ, సీఆర్టీ

ప్రభుత్వ మహిళ సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తాము ఎనిమిది గంటల కంటే అధికంగా శ్రమిస్తున్నాం.



ప్రసూతి సెలవులు ఇవ్వాలి : సురేఖ, సీఆర్టీ

ప్రభుత్వ మహిళ ఉద్యోగులకు ఇస్తున్న విధంగానే మహిళ సీఆర్టీలకు ప్రభుత్వం ప్రసూతి సెలవులు ప్రకటించాలి. అదే విధంగా మహిళ సీఆర్టీల పిల్లల సంరక్షణకు చైల్డ్‌కేర్ సెలవులు ఇవ్వాలి.



ప్రజా ఉద్యమం నిర్వహిస్తాం : వంశీ, సీఆర్టీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సీఆర్టీల సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ ముందు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం మొండికి పోకుండా తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలి. లేనట్లయితే ప్రజా ఉద్యమాన్ని నిర్వహిస్తాం. పాఠశాలల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు సీఆర్టీల సమ్మెకు సంఘీభావం తెలపడానికి సిద్ధంగా ఉన్నారు.



సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం : రమేష్, సీఆర్టీల సంఘం, జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న సీఆర్టీల సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం. అంతేకాకుండా తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు పాఠశాలలకు వెళ్లం.



సీఆర్టీల సమస్యలను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు తెలిపాం : జాదవ్ వసంత్‌రావు, ఇన్‌చార్జీ డీడీ

గత కొన్ని రోజులుగా ఐటీడీఏ ముందు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న సీఆర్టీల సమస్యలను గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కు నివేదించాం. అక్కడి నుంచి ప్రభుత్వానికి కూడా సమస్యలు వెళ్లాయి. సీఆర్టీల డిమాండ్లు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం ఒక నెల వేతనంతో పాటు నాలుగు నెల ఏరియర్స్ సీఆర్టీల ఖాతాల్లో జమ చేశాం. సమ్మె విరమించాలని ప్రాజెక్టు అధికారి కూడా కోరారు. ఆశ్రమ పాఠశాలలో విద్యబోధన కొనసాగుతుంది. కేవలం 155 ప్రాథమిక పాఠశాలల్లో విద్యబోధన నిలిచింది.





ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

'ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి'

ఇంద్రవెల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దన్నోరా(బి) గ్రామంలో ప్రధాన రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. రూ.రెండు లక్షల రుణమాఫీ ఉన్న రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. అదే విధంగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర రైతులకు పహానీలు ఇచ్చి బ్యాంకుల ద్వారా పంట రుణ సౌకర్యం కల్పించారని, ప్రస్తుతం ప్రభుత్వం గిరిజనేతర రైతులకు పంట రుణాలు కానీ రైతు సంక్షేమ పథకాలను వర్తింపజేయడం లేదని అన్నారు. ఏజెన్సీలో గిరిజనేతర రైతులను గుర్తించి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇచ్చే విధంగా కృషి చేయాలన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై దుబ్బాక సునీల్ గ్రామానికి చేరుకుని రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సతీష్, రవి, లక్ష్మణ్, రమేష్, రాజు, బాలాజీ, తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఉట్నూర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యదృశ్య పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏజెన్సీ అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడిమెత మనోహార్ అన్నారు. ఆశ్రమ పాఠశాలల తనిఖీలలో భాగంగా మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని, ఎవరైనా అనారోగ్యానికి గురైతే హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందించాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీవేణికి సూచించారు. జీసీసీ ద్వారా సరఫరా అవుతున్న సరుకులను పరిశీలించారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ నాందేవ్ ఉన్నారు.

పాఠశాలల్లో టీచర్లను నియమించాలి

సిరికొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత, ఉర్దూ మీడియం పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా అదనపు ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ గ్రామస్థులు ఎంఈవో సునీల్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 105 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ.. ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే బోధిస్తున్నారు. తరగతులకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. ప్రాథమికోన్నత స్థాయిలో తరగుతులు బోధించేందుకు ఎనిమిది మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా, కేవలం ఇద్దరు ఉపాధ్యాయులతోనే నెట్టుకురావడంతో విద్యార్థులకు సరైన విద్య అందడంలేదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు

- అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశం
- ఆయా శాఖల అధికారులతో సమావేశం

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, నార్కోటిక్ మత్తు పదార్థాలను పూర్తిగా అంతం చేసేలా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ గౌస్‌ఆలం ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో నార్కోటిక్-కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి,డ్రగ్స్ మత్తు పదార్థాల బారిన ప్రజలు పడకుండా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కళాకారులతో గ్రామ గ్రామాన గంజాయి, పొగాకు వాటిపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. రవాణా, క్రయవిక్రయాలను నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డ్రగ్స్ నివారణపై వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. తరగతుల వారీగా యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. బడికి రాని, బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించి డ్రగ్స్ బారీన పడకుండా పిల్లలకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రాల్లో గంజాయి పెంచకుండా రైతులకు అవగాహన కల్పించాలని, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో మత్తు చాక్లెట్లు, ఇతరాత్ర పదార్థాల రూపంలో డ్రగ్స్ విక్రయాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అనే పదం వినపడకుండా గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, అందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీవో వినోద్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి : ఎమ్మెల్యే పాయల

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అందరికీ అన్న పెట్టే అన్నదాతలు సంతోషంగా లేరని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం శాసన సభలో రైతు సమస్యల గురించి ప్రభుత్వానికి నివేదించారు. వ్యవసాయం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. రైతులు తమ పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. విద్య, వైద్య రంగాల్లో రైతులకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, విత్తనాలు, ఎరువులు, పంట పొలాలు తీసుకెళ్లేందుకు పండించిన పంటను తిరిగి ఇంటికి తెచ్చుకునేలా పంట పొలాల రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

'భాషా ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలి'

ఉట్నూర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జీవో 3కి బదులుగా విద్యాహక్కు చట్టం కింద భాషా ప్రాతిపదిక మీద ఉద్యోగ, ఉపాధ్యాయ నియమకాలు చేపట్టాలని.. అవి కూడా ఐటీడీఏ ద్వారా చేపట్టాలని మంత్రి సీతక్క నాయకత్వంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జుపటేల్, కోరం కనకయ్య, కడాది నారాయణ, పాయం వెంకటేశ్వర్లు, ఆదివాసీ ప్రొఫెసర్లు చిదం కిషోర్, డాక్టర్ అనురాధా, జి.వెంకటరమణ, డాక్టర్ పద్మజ, తదితరులతో కూడిన ప్రతినిధి బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరారు. భాషా ప్రతిపదికన నియమకాలు జరిగితే గోండు, కోలాం, మన్నెవార్, నాయక్‌పోడ్, కోయ తదితర ఆదివాసీ తెగలకు న్యాయం జరుగుతుందని ప్రతినిధి బృందం సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇదిలా ఉండగా ఇందిరమ్మ ఇళ్లు ఆదివాసీలందరికీ అందేవిధంగా ఐటీడీఏలకు ప్రత్యేక కోట మంజూరు చేయాలని కోరగా.. వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిని ఆదేశించారని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ వివరించారు.

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఫ్లెక్సీ దహనం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యాలను ఖండిస్తూ శనివారం జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ మేరకు అమిత్‌షా ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'కేంద్ర హోం మంత్రి వెంటనే రాజీనామా చేయాలి'

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చిత్రపటం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ నాయకులు దాసండ్ల ప్రభాకర్, ప్రజ్ఞ శీల్‌కాంబ్లె, భరత్‌చౌహాన్, తదితరులు మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలవర్షం కురిపిస్తూ నినాదాలు చేశారు. అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగారే భారత్, దూట రాజేశ్వర్, కాటం రమేష్, రంజనబాయి, కడమళ్ల రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవితం కోసం ధ్యానం చేయాలి

తలమడుగు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రతిఒక్కరూ ప్రతీరోజు ధ్యానం తప్పకుండా చేయాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ కోరారు. శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సునీత వెంకట్ మాట్లాడుతూ విత్తనంలో వృక్షం దాగి ఉన్నట్లు 40ఏళ్ల క్రితం నాటిన ధ్యాన విత్తనం ఈరోజు ప్రపంచాన్ని చుట్టి ఐక్యరాజ్య సమితిలో డిసెంబరు 21ను ధ్యాన దినోత్సవంగా ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మన గురుదేవులు పత్రిజీ కల సహకారమైందన్నారు. కోట్లమంది పిరమిడ్ మాస్టర్ల జీవితాలలో వెలుగులు నింపిన పూజ్య గురుదేవులకు, మనందరం పిరమిడ్ జగత్, ధ్యానజగత్ శాఖహారజగత్‌గా మార్చడంలో తన్, మాన్, ధన్ ఏవిధంగానైనా సహకరించి గురుదేవుల, ఆశయసాధనలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ధ్యాన మాస్టర్లు వెంకట్, సంతోష్, సునీతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బోథ్(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేదం పాఠశాలతో పాటు ఆదర్శ పాఠశాలలో శనివారం ధ్యాన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు ధ్యానం వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రతిరోజు కనీసం అరగంటైన ఏకాగ్రతతో ధ్యానం వల్ల ఆరోగ్యంగా ఉండడంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్‌తో పాటు వేదం పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవం

ఉట్నూర్(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయుష్ శాఖ మల్లేశం ఆధ్వర్యంలో శనివారం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా చేయడం వల్ల ఆరోగ్యం అన్ని విధాల ఎంతగానో బాగుంటుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాణాయామంతో పాటు వివిధ రకాల యోగా ఆసనాలు విద్యార్థులతో చేయించారు. ఇందులో ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.